కౌజుపిట్టలు

మధ్యాహ్నం పన్నెండు గంటలయింది.

మండిపడుతోన్న ఆఫీసరులా ఉన్నాడు సూర్యుడు. ఆఫీసరు కోపంలా ఉంది ఎండ. ఆ కోపానికి ఆహుతయ్యే ఆఫీసు స్టాఫ్‌లా ఉంది లోకమంతా.

'ఎంత ఎండబ్బా!" అనుకున్నాడు ఆంజనేయులు. మరి కాసేపట్లో జేసీ (జాయింట్ కలెక్టరు) గారు ఆ బంగళాకి వస్తారు. అంచేత వెన్నులో అదురుగా, గుండెల్లో బెదురుగా, కాళ్ళల్లో వణుకుగానూ ఉంది ఆంజనేయులికి. అతనక్కడ 'ఆరై' (రెవెన్యూ ఇన్‌స్పెక్టర్) కాబట్టి, ఈ బంగళా దగ్గర 'ప్రోటోకాల్' అని గౌరవంగా ఆంగ్లంలో పిలువబడే 'కట్టుబానిస' పని చేస్తున్నాడు.

బ్రిటీషోడు కట్టించినందువల్ల ఆ బంగళా ఎప్పటినించో చెక్కు చెదరకుండా అధికార దర్పం సమసిపోని వృద్ధ మహారాజులా ఉంది. వృద్ధ మహారాజుని సదా రక్షించేందుకు అలర్టుగా నిలుచున్న యువ సైనికుల్లా ఉన్నాయి ఆ ఆవరణలోని వేప, రావి, చింతచెట్లు.

'అబ్బా! ఎంత ఉక్కగా ఉంది, ఒక్క ఆకయినా అల్లాడలేదు. గట్టిగానే అన్నాడు ఆంజనేయులు. గాలిని సరఫరా చేయడం చెట్టు ధర్మమైనట్టూ, సదరు ధర్మాన్ని పాటించకపోయినందువల్ల వాటివేపు చికాగ్గా కొత్త జడ్జిగారు పాత ముద్దాయిని చూసినట్టు ఓసారి వేపచెట్టునీ, దాని తాలూకు కొమ్మల్నీ, ఆకుల్నీ విడివిడిగా చూసేడతను.

వెట్లూ, తలార్లూ బంగళా వెనకాల పాత్రల్ని శుభ్రపరుస్తున్న శబ్దాలు వినిపిస్తున్నాయి...ఆంజనేయులికి.

బంగళా బయటి గదిలో జేసీ గారు వస్తూనే అతని నాలుకనీ, ముక్కు పుటాల్నీ, మనసునీ, తృప్తిపరిచే రకరకాలయిన శాఖాహార, మాంసాహార పదార్థాలు ఘుమఘుమ లాడుతోన్నాయి.

వరండా మెట్ల మీదనించీ లేచి వేపమాని కిందకి వచ్చి నిలుచున్నాడు ఆంజనేయులు. ఎడం చేత్తో కాలరుని మెడనించీ, ఎడంగా జరిపేడు గాలి తగలడం కోసం. అతను చెట్టుకింద ఉన్నాడే కానీ, అతని చూపులు మాత్రం గాల్లో ఉన్నాయి. అతని ఆలోచనలు మాత్రం పార్టీల చుట్టూ, ఆ పార్టీలు ఇవ్వాల్సిన డబ్బు చుట్టూ గింగుర్లు కొడుతున్నాయి.

వేపచెట్టు కొమ్మలో కాకీ, కాకిపిల్లా కావ్‌కావ్ మంటూ గోల చేయడంతో అతని ఆలోచనలు అప్పుడప్పుడు డిస్టర్బ్ అవుతున్నాయి.

"అమ్మా! అమ్మా! ఆకలిగా వుందే ఏమైనా పట్టుకు రావే!" అంటూ తల్లికాకిని పిల్లకాకి గోముగా అడుగుతోంది - సన్నటి కొమ్మమీదకి వాలి. అదలా అరుస్తోంటే దాని బుల్లిరెక్కలు గోముగా వణికిస్తోంటే, తల్లికాకి ముచ్చటగా చూస్తూ "ఉండవే నీ గోలొకటీ, ఏదయినా పురుగో పుట్రో కనిపించనీ.. నేలమీద ఒక కన్ను వేసి ఉంచాను లేవే... ఎండకదా ఒక్క పురుగూ వచ్చి చావడం లేదు" అంది మరో కొమ్మమీంచి.

"ఏమో నాకవన్నీ తెల్దు.. ఆకలే అమ్మా ఆకలే!" పిల్లకాకి గోల.

ఆంజనేయులు ఈ రెండింటి గోలనీ ఒక్క నిమిషంపాటు చూసి కోపం తెచ్చుకున్నవాడై. నేలనున్న గులకరాయి నొకదాన్ని తీసుకుని పిల్లకాకి మీదకి విసిరాడు. పిల్లకాకి గులకరాయ దెబ్బను తప్పించుకోడానికి ఆ కొమ్మమీది నుంచీ రివ్వున మరో కొమ్మమీదికి పోయింది. అయితే గోల చేయడం మాత్రం ఆపలేదు.

మరొక్క రాయి తీసుకుని మళ్ళీ విసరాలని అనిపించినా, తల్లికాకీ, పిల్లకాకీ కొమ్మలు దాటుతాయే కానీ చెట్లు దాటిపోవనే సత్యాన్ని గ్రహించినవాడై ఊరకుండి పోయనాడు ఆంజనేయు.

'అమ్మా! అమ్మా! ఇందాకా నాపై రాయి విసిరాడు చూడవే వాడిపైన రెట్ట వేస్తానే!" అంది పిల్లకాకి.

"అలాగే చెయ్యవే!, అదికూడా చెప్పాలా?" అంది తల్లికాకి.

తల్లి దగ్గర్నించీ పర్మిషన్ వస్తూనే ఆపనే చేసింది పిల్లకాకి.

రెట్ట నేరుగా వచ్చి ఆంజనేయులి తలమీద 'టప్' మని పడింది. పిల్లకాకివైపు చురచుర చూసి బండ బూతుల్ని మనసులోనే తిట్టుకుంటూ దగ్గర్లోనే ఉన్న చెత్త కాయితంతో తుడిచేసు కున్నాడు ఆంజనేయులు.

దూరంగా కారు వస్తున్నట్టు శబ్దమయితే రోడ్డు వైపు చూసేడు. అల్లంత దూరంలో తెల్లటి కారు శరవేగంతో దూసుకు వస్తున్నది.

ఆంజనుయులి గుండెలు దడదడలాడాయి. 'ఇంకా ఎమ్మార్వో రాకనే వచ్చేస్తున్నాడే జేసీ.. ఏం జేసేదబ్బా.. కానీలే ఏమయితే అదే అయింది' అనుకుని కారు వచ్చి ఆగుతూనే తను వినయ విధేయతలతో 'జేసీ' గారికి ఎలా నమస్కరించాలో ఒకసారి మెదడు తెరపై రిహార్సల్ చేసుకున్నాడు ఆంజనేయులు.

ఆ కారు జేసీ గారిది కానందువల్ల రోడ్డుపై తిన్నగా కుడివైపు నించీ ఎడమవైపుకి వెళ్ళిపోయింది.

'హమ్మయ్య!' అనుకున్నాడు ఆంజనేయులు. కాసాపురం ఆంజనేయులు స్వామికి ఓ దండం పెట్టుకున్నాడు.

పై అధికారులు వస్తున్నారంటే కింది ఉద్యోగులకు భయం ఉంటుందన్నది సహజమైన విషయమే. అయితే ఈసారి 'జేసీ' గారి రాక మాత్రం ఒక్క ఆరై ఎమ్మార్వోలనే కాదు. 'ఊరగాద్రి' పాత తాలూకాకి సంబంధించిన విడపగల్లూ, వజ్రాలపేట మండలాల అధికార్లనూ, ఆరైలనూ కూడా భయకంపితుల్ని చేస్తోంది. వాళ్ళంతా అంత భయ కంపితులు కావడానికి కొంత కారణం ఉంది.

సరిగ్గా ఆరు నెలల కిందట ఇలాగే జేసీగారి ప్రోగ్రాం ఉందని మూడు మండలాల ఎమ్మార్వోలూ, ఆరైలూ ఆయనకు ఏ లోటూ రాకుండా మర్యాదలు జరపడానికి భయభక్తులతో నిరీక్షిస్తూ ఉన్నారు. సరిగ్గా రెండు గంటలు అవుతున్నట్టే జేసీ గారు రానే వచ్చేరు. ఆకలిగా ఉన్నదంటూ ఆవురావురుమంటూ భోజనాలకి కూర్చున్నారు. అతనికి వడ్డించడానికి ముగ్గురు ఎమ్మార్వోలు జొరబడ్డారు. జేసీగారు చపాతీని నోట్లో పెట్టుకున్నారో లేదో మొహమంతా అదో మాదిరి పెట్టేసి - ఆంగ్లంలోనూ, తెలుగులోనూ, విడివిడిగానూ, కలిపీ తిట్టేసేడు. దాని సారాంశం ఏమిటంటే "ఇదసలు తిండేనేమండీ, ఏదో తిండికి మొహం వాచీ ఇట్లా క్యాంపులకి ఎగబడి వస్తున్నామనుకొన్నారా? ఈ జేసీ గాడి మొహానికి రుచులేం తెలీవులే - ఏది మొహాన కొట్టినా తిని చస్తాడులే అనుకున్నారా... లేకపోతే ఇది కోడికూరా? ఇది మటన్ ఫ్రయ్యా?...ఇది పలావా? ఇది ఇట్లా చేస్తే ఇటు పక్కకి ఇంక రాడులే అనే దురుద్దేశం కనబడుతోంది నాకు!"

"సార్! సార్! అదేం లేదు సార్!....."అంటూనే చేతుల్ని పిసుక్కుంటూ మొహాలు దీనంగా పెట్టేస్తూ చెక్కబొమ్మల్లా ఉండిపోయినారు ముగ్గురు ఎమ్మార్వోలు.

"మీరు సరేనండీ, ఆరై ఏం చేసినట్టూ... చక్కగా రుచిగా వండించడం రాకపోతే ఆరైగా ఎట్లా పనికొస్తాడంట!" అని కోప్పడ్డాడు జేసీగారు.

ఆరై కోర్సులో పై అధికార్లకు గొప్ప రుచిగా వంటలు వండించడం కూడా ఒక భాగమని ఆ రోజు తెలిసి వచ్చింది ఆంజనేయులికి.

జేసీగారినుంచీ మెచ్చుకోళ్ళు రాకున్నా తిట్టకుంటే చాలుననీ, ఈసారి జేసీ గారికి ఏవేన్నా ఇష్టమో ఆయన అటెండర్నీ, డ్రైవర్నీ పదే పదే వేగుల వాళ్ళలా కనుకున్నాడు. జేసీగారి నాలిక్కి ఇష్టమైన కూర కౌజుపిట్టల ఫ్రైయ్యేనని తెలుసుకున్నాడు. అంతకు ముందు రోజే పచ్చనోట్లని రెండింటిని ఖర్చుపెట్టి డజను కౌజుపిట్టల్ని తెప్పించేడు. కౌజుపిట్టల్ని బాగా వండే వంట మనిషిచేత వండించేడు ఆంజనేయులు. ఈసారి తప్పకుండా తనని జేసీగారు మెచ్చేసుకుంటారని లోలోపల అతనికి భరోసా కూడా లేకపోలేదు.

బంగళాలో ఫోన్ రింగవుతోంది.

గబా గబా లోపలికి వెళ్ళి ఫోన్ ఎత్తేడు ఆంజనేయులు. ఫోన్‌లో ఎం.ఆర్.ఓ. గొంతు వినిపిస్తూనే అటెన్షన్లో నిలబడి వినయంగా అంతా వింటూ 'ఎస్ సార్, అలాగే సార్!' అంటూ ఉన్నాడు. రెండు నిమిషాల తరువాత ఫోన్‌పెట్టేసి మళ్ళీ వరండాలోకి వచ్చేడు. మరో అరగంటలో వచ్చే జేసీగారికోసం 'బీ రెడీ' అంటూ ఫోన్‌లో హెచ్చరించినందుకు ఎమ్మార్వో మీద కోపమొచ్చింది. కొత్తగా ఉద్యోగంలో చేరిన వాడికున్న అదురూ, వణుకూ రెవెన్యూ వాళ్ళకి రిటైరయ్యే వరకూ పోదేమో అనుకున్నాడు.

ఐదు నిమిషాల తరువాత మూడుమండలాల ఎమ్మార్వోలూ, తమ తమ హెడ్‌క్లర్కులూ, ఆరైలతో పాటూ అక్కడికి చేరుకున్నారు. వరండాలో ఉన్న కుర్చీలల్లో ఎమ్మార్వోలు మాత్రం ఆసీనులయ్యారు. తక్కిన వాళ్ళు నిలబడే ఉన్నారు.

"ఈసారి జేసీగారు అయిసు కావాల్సిందే.... చూడండి ఎట్లా వస్తున్నాయో మసాలా వాసనలు.. ఇప్పటికప్పుడే వాట్ని నమిలి మింగేద్దామా అనిపిస్తోంది!!' అన్నాడు (ఉరగాద్రి) ఎమ్మార్వో.

"అవునవును నోరూరుతా వుంది. మరి జేసీగారి టేస్టు ఎట్లుందో!' విడపగల్లు ఎమ్మార్వో.

"ఈసారి నోరెత్తకూడదు అన్నట్లున్నాయి ఐటెమ్స్" అన్నాడు వజ్రాలపేట ఎమ్మార్వో, ఆంజనేయులి వేపు చూస్తూ.

ఆంజనేయులికి, ఎమ్మార్వోల మాటలు వింటూంటే నవ్వు వస్తోంది జేసీగారు వస్తోంది కేవలం 'తిండికోసమే' అన్నట్టుగా ఉన్నాయి.

"ఇంతకీ జేసీగారు వస్తున్నది ఇంటి స్థలం తకరారు కేసు ఎంక్వయరీకేనా" అన్నాడు విడపగల్లు ఎమ్మార్వో.

'అదే - బళ్ళారి నారాయణప్ప ఇంటి స్థలం కేసు... అదేం తెగేదా తెల్లారేదా!' ఈ జేసీ మనిషి ఎన్నిసార్లు రావాలో" అన్నాడు ఉరగాద్రి ఎమ్మార్వో.

"ఎంతమంది జేసీలు మారేరో అది చెప్పండి సార్!" అన్నాడు వజ్రాలపేట ఎమ్మార్వో.

"సార్! తెల్లకారు వస్తోంది...ఇట్లే మన బంగళా వైపు తిరిగింది సార్!" అనరిచాడు ఆంజనేయులు. 'సార్ బాంబు.. మన మీదికే పడ్తోంది' అన్నట్టుగా ఉంది అతని గొంతు.

అప్పుడే బాంబు పేలినట్లుగా అదిరిపడి ముగ్గురూ కంగారుగా లేచి నిలుచున్నారు.

'జేసీ'గారి కారు వచ్చి ఆగింది. కారులోంచి తెల్లవన్నె పులిలా దిగారు జేసీ తెల్లని సఫారీ డ్రెస్‌లో...పులులు నవ్వవు. అందుకే తెల్లపులి నవ్వలేదు. అయితే పులులకు లేని ప్రత్యేకతలు మరికొన్ని వున్నాయి - తెల్లపులికి, కళ్ళకి గోల్డు ఫ్రేమున్న చిన్న అద్దాలు స్టైయిలుగా వున్నాయి. చేతికి ఖరీదయిన బంగారు వాచీ ఉండి, మెళ్ళో బంగారు గొలుసుంది. ఎడమ చేతి ఉంగరంవేలికి పగడమో, పచ్చో పొదిగిన బంగారు ఉంగరం ఉంది.

చక్రవర్తి దిగినప్పుడు సామంత రాజులా వణికిపోయేరు ముగ్గరు ఎమ్మార్వోలూ... సామంత రాజుల కిందున్న కట్టుబానిసల్లా వణికిపోయేరు ఆర్లైలూ, హెడ్డు గుమస్తాలూ. సాష్టాంగ ప్రణామాలు చేయడం ఎందుచేతనో మన సాంప్రదాయంలోంచి తొలగి పోయింది కాబట్టి, చక్రవర్తి గారిలా కారుదిగి వున్న జేసీగారికి సామంతరాజులు వినయంగానూ, కట్టుబానిసలు వీపు భాగాన్ని కొంత ముందుకు వంచి సవినయంగానూ నమస్కరించేరు. సదరు నమస్కారాలు తన స్థాయిని పెంచేవిగా ఉన్నట్లు జేసీగారు గ్రహించినందువల్ల, సామంతరాజుల్నీ, కట్టుబానిసల్నీ ఓసారి సంపూర గంభీర వదనంతో పరకాయించి శిరఃకంపనంతో వాళ్ళ నమస్కారాల్ని అన్నింటినీ స్వీకరించినట్లు తెలిపి హుందాగా అడుగులువేస్తూ బంగళాలోకి సాగిపోయేరు. చక్రవర్తిని అనుసరిస్తూ సామంతరాజులూ, కట్టు బానిసలూ...

సింహాసనం మీద ఆసీనుడైనట్టు చక్రవర్తిగారు సోఫాలాంటి కుషన్ కుర్చీలో హుందాగా కూచున్నారు. మరింత హుందాకోసం కాలిమీద కాలు వేసుకున్నారు. తక్కిన కుర్చీల్లో కూచోవడమా? మానడమా? అన్న సందేహంతో బొమ్మల్లా ఉండిపోయారు ముగ్గురు ఎమ్మార్వోలు. అయితే బానిసలకు సందేహాలు వస్తాయేమో కాని కట్టుబానిసలకు సందేహాలు ఉండవు. అంచేత వినయంగా 'సదా మీ సేవలో' అన్న భావం వచ్చే మొహాలు వేసుకుని వున్నారు హెడ్‌గుమస్తాలూ, ఆర్‌ఐలూ.

ఈలోగా ఆంజనేయులు ఉరఫ్ కట్టుబానిస కొబ్బరి బొండంతో ప్రత్యక్షమై సవినయం ఏ మాత్రం సమసిపోకుండా భయం భయంగా దళితుడు అగ్రవర్ణస్తుడికి ఇస్తున్న చందంగా ఇవ్వగా... జేసీగారు హుందాగా చేతుల్ని చాచి అది హుందాగా అందుకుని ప్లాస్టిక్ గొట్టాన్ని నోట్లోపెట్టుకుని ఓసారి పీల్చి అందరివైపు చూసేడు. జేసీగారి చూపుల్ని ఎట్లా అర్థం చేసుకోవాలో తెలీక అక్కణ్ణించీ కదలల్లేకా, మెదలలేకా నానా అవస్థలు పడుతున్నారు ముందు వరుసలో నిలుచున్న ఎమ్మార్వోలు. జేసీగారు మరో రెండు గుటకలు వేసి 'మీరు తీసుకోలేదేం?' అన్నారు.

'అ'బ్బే, తీసుకుంటాం సార్ – మీరు కానియ్యండి" అన్నారు ముగ్గురు ఎమ్మార్వోలు ముక్తకంఠంతో.

"ఊ... సరేగాని మీమీమండలాల్లో ల్యాండ్ రెవెన్యూ ఏమాత్రం... కలెక్షన్ బాగానే అవుతోందా... ఏవీ ల్యాండ్ రెవెన్యూ స్టేట్‌మెంట్స్? సివిల్ సప్లయిస్ విషయంలో ఏమైనా ప్రాబ్లెమ్సా – కిరోసిన్ ఈనెల్లో బాగానే బట్వాడా అయిందా?" ఇలా ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు జేసీగారు.

'యస్సార్, యస్సార్' అంటూ రెడీగా ఉంచుకున్న ల్యాండ్ రెవెన్యూ స్టేట్‌మెంట్స్యూ ముగ్గురూ పాడ్సనించీ తీసి ఇచ్చారు.

"బైదిబై" ఈ రోజు బాగా ఎండగా ఉంది కదూ.. హౌస్ సైటు ఎంక్రోచ్‌మెంటు గొడవ ఎంక్వయిరీ చేయాలి....ఆకలిగా ఉంది...ఎంక్వయిరీకి సాయంత్రం ఐదింటికి వెళ్దాం...ఫుడ్ రెడీగా ఉందా?' అన్నారు జేసీగారు.

చక్రవర్తి గారు 'ఆకలి' అంటే, సామంతరాజులు, వారి పరివారమంతా ఎంత అల్లాడిపోవాలో అంత అల్లాడిపోయారు ముగ్గురు ఎమ్మార్వోలూ, వారిస్టాఫూ. ఘుమఘుమ లాడుతోన్న వంటల్ని రెండు నిమిషాల్లో డైనింగ్ టేబుల్ మీద సర్దారు.

భోజనం చేయడానికి జేసీగారు రెడీ అయినారు.

జేసీగారి క్యాంపు క్లర్కు పక్కన ఉన్న చిన్న గదిలో తినడం ప్రారంభించేడు.

ఆర్ఐ ఆంజనేయులూ, అర్బన్ ఎమ్మార్వో జేసీగారికి దగ్గరుండి మరీ వడ్డిస్తున్నారు.

"ఓహ్!వెరీనైస్ ఐటెమ్స్...చాలా టేస్టీగా వున్నాయి. వెరీగుడ్!' అంటూ జేసీగారంటూ ఉంటే ఏనుగును ఎక్కినంత ఆనందంగా ఉంది. అర్బన్ (ఉరగాద్రి) ఎమ్మార్వోకు. మెచ్చుకోలుగా ఆర్ఐని చూసేడు ఎమ్మార్వో. ఆర్ఐ గుండెలు బెత్తెడు మందంపొంగి అలా ఉండిపోయేయి.

"ఫిష్ ఫ్రై భలే ఉంది, చికెన్ రోష్ట్ అమోఘం, మటన్ కబాబ్ అద్భుతం... అయితే కౌజుపిట్టల ఫ్రై ముందు ఏదీ పనికి రాదు. అంత పరమాద్భుతంగా ఉంది. నా

జీవితంలో ఇంత రుచికరమైన భోజనం 'ఇప్పుడే చేశాను' అన్నారు జేసీ. పరమానంద భరితుడైనాడు ఎమ్మార్వో. కరిగి నీరయాడు. పరవశిస్తూ వీలుంటే ఆనంద తాండవం చేయడానికి సిద్ధపడ్డాడు ఆర్షై ఆంజనేయులు.

జేసీగారి భోజనం ముగిసింది.

"కిళ్ళీ వేసుకుని కింగ్ సైజ్ సిగరెట్లు వెలిగించేరు జేసీగారు. "ఈ జిల్లాలోని 63 మండలాల్లోనూ తినని ఇంత మంచి భోజనం ఈపూట తిన్నాను... మిమ్మల్ని హృదయ పూర్వకంగా అభినందిస్తున్నాను" అంటూ మరోసారి మెచ్చుకున్నారు.

"థ్యాంక్స్ సార్!" అంటూ ఎమ్మార్వో అన్నాడు.

'అసలు.... ఆ కౌజు పిట్ల ఫ్రై ఎంత బావుందండీ! వాటి రుచి మరి దేనికి రాదు. మీకు ఇష్టమనే మా ఆర్షై కౌజుపిట్టల ఫ్రై చేయించాడు సార్!" అన్నాడు ఎమ్మార్వో సంతోషంగా.

'నిజంగా... వెరీ గుడ్... ఇక్కడ కౌజుపిట్టలు బాగానే దొరుకుతున్నాయా?"

"యస్సార్?" అన్నాడు ఎమ్మార్వో నమ్రతగా.

"చేలల్లో ఎక్కువగా ఉంటాయి లెండి. వాటిని తింటుంటే నా చిన్నతనంలో మాపల్లె జ్ఞాపకానికి వచ్చింది. మా నానమ్మ జ్ఞాపకానికి వచ్చింది. ఆమె నా కోసం వండే కౌజు పిట్టల కూర జ్ఞాపకం వచ్చింది. ఎంత కమ్మగా వండేదో మానానమ్మ! నిజానికి మీకు థ్యాంక్స్ చెప్పాలి."

అహో.. ఆనందమో... ఆనందం, బ్రహ్మానందం.. పరమానందం.. పై అధికారి మెచ్చుకోలు మహదానందం...

ఎమ్మార్వో, ఆర్షై మొహాలు విరిసిన పొద్దు తిరుగుడుపువ్వులైనాయి.

"సీ మిస్టర్ ఎమ్మార్వో.. ఓ పని చేస్తారా...ప్రతి శనివారం సాయంత్రం నా బంగళాకి మూడు జతల కౌజుపిట్టల్ని - అంటే ఆరింటినీ పంపించండి. అదీ మీకు ఇబ్బంది అనిపించకపోతేనే.....అంటూ ఎమ్మార్వో మొహంలోకి చూశారు జేసీగారు.

"అబ్బే తమ కోసం.. తమరు అడిగితే... తప్పకుండా పంపిస్తాం సార్! మీరు అడగడమే మహాభాగ్యం. మా ఆర్షై ఆంజనేయులు మీ బంగళాకి ప్రతి శనివారం కౌజుపిట్టల్ని అందజేస్తాడు."

అందాక అలవోగ్గా వింటూ ఆనందిస్తున్న ఆంజనేయులు పై ప్రాణాలు పైన్నే పోయాయి. ఈ రోజు వండిన కౌజుపిట్టల కోసమే రెండు పచ్చనోట్లు ఖర్చుపెట్టిన వైనం కళ్ళ ముందు తిరుగుతోంది. వరండాలోకి వచ్చి కూలబడ్డాడు. అతనికి మరేమీ వినిపించడం లేదు.

(ఆదివారం ఆంధ్రజ్యోతి - 21 జనవరి, 1996)